నవతెలంగాణ
1
ఆదిలాబాద్
ఆదివారం | జూన్ 30, 2024 | www.navatelangana.com

కాపు సంఘానికి శ్రీనివాస్ లేని లోటు తీరనిది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పిన వ్యక్తి నిజామాబాద్ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ లేని లోటు సంఘానికి తీరనిదని ఆదిలాబాద్ తాలుకా అధ్యక్షుడు కాళ్ల విఠల్ అన్నారు. శనివారం మున్నూరు కాపు సంఘ భవనంలో శ్రీనివాస్ సంతప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తాలుక అధ్యక్షుడు కాళ్ల విఠల్ మాట్లాడుతూ మున్నూరు కాపుల అభ్యున్నతికి శ్రీనివాస్ కృషి చేశారన్నారు. మంత్రిగా, నిజామాబాద్ ఎంపీగా సేవలందించారని తెలిపారు. అదే విధంగా సంఘానికి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ఆయన మరణం సంఘానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధన దిశగా మున్నూరు కాపులు ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కలాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొరెడ్డి శంకర్, చందా నర్సింగ్, ఆవుల వెంకన్న, ఎర్రం నరేందర్, ఈశ్వర్, బండారి కృష్ణ పాల్గొన్నారు.

రూ.6లక్షల విలువైన గుట్కా పట్టివేత

నవతెలంగాణ-భైంసా
ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసాలో పోలీసులు ఏకకాలంలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రూ.6లక్షల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు నారాయణసింగ్, షరీఫ్ మూడు బృందాలుగా విడిపోయి కిరాణా, పాన్ షాపుల్లో, గోదాముల్లో తనిఖీలు చేపట్టారు. ఇకనైనా గుట్కా అమ్మకాలు మానేయాలని, లేనిపక్షంలోకి చట్ట పరమైన శిక్షలు తప్పవని సీఐ హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్ఐ తారాచంద్, కానిస్టేబుల్స్ భూషణ్ రమేష్, శైలేష్, సాయి, ప్రశాంత్, శంకర్ పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళిక ఖరారు..!

- ఈ ఏడాది పంట రుణాల కోసం రూ.2577.93కోట్లు
- గతేడాది కంటే రూ.223.87 కోట్లు అధికం
- పరిశ్రమల స్థాపన కోసం రూ.1195.44కోట్లు
- ప్రాధాన్య రంగాలకు మరో రూ.168.36కోట్లు కేటాయింపు

అధికారులు వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. రైతులు, ఇతర రంగాల వారికి అందించే రుణాలను ఆయా రంగాల వారీగా కేటాయింపులు చేశారు. గతేడాది 2023-24 కంటే అధికంగా ఈ ఏడాది పంట రుణాలను పెంచడం కొంత ఊరటనిచ్చేదిగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ ఏడాది పంట రుణాలను రూ.2277.93కోట్లు కేటాయించారు. గతేడాది కంటే రూ.223.87కోట్లు అధికంగా పెంచినట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క పరిశ్రమల స్థాపన (ఎంఎస్ఎంఈ)ల కోసం రూ.1195.44కోట్లు కేటాయించగా.. ప్రాధాన్య రంగాలకు మరో రూ.168కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా కేవలం కేటాయింపులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఆయా రంగాల వారికి రుణాలు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. మరోపక్క పంట రుణాలను పెంచామని చెబుతున్న అధికారులు గతేడాది ఎన్నికోట్లు ఇచ్చారో లెక్కలు వెల్లడించకపోవడం గమనార్హం. రుణాలు కేటాయిస్తున్నా.. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వడం లేదని రైతు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి
ప్రజల ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకుల సహకారం చాలా కీలకం. వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రజలకు బ్యాంకులు రుణాలు అందిస్తే వ్యవసాయం, వ్యాపారాలు, చదువు తదితర రంగాల్లో ఆర్థిక వృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. తాజాగా ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. తాజాగా పంట రుణాల కోసం కిందటేడాది రూ.2354.06కోట్లు కేటాయించగా..ఈ ఏడాది రూ.2577.93కోట్లు కేటాయించారు. రూ.223.87కోట్లు అధికంగా కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలు కిందటేడాది రూ.895.57కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది రూ.984.95 కోట్లు కేటాయించారు. రూ.89.39కోట్లు అధికంగా కేటాయించారు. ఇక పరిశ్రమల స్థాపనకు ఆర్థిక సాయం కోసం కిందటేడాది రూ.800.05కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది వీటిని రూ.1195.44కోట్ల కేటాయించారు. రూ.395.39కోట్లు అధికంగా కేటాయించినట్లు చెబుతున్నారు. ఇక ప్రాధాన్యరంగాలైన విద్య, గృహనిర్మాణం, సోలార్, సామాజిక రంగాలకు కలిపి కిందటేడాది రూ.168.36కోట్లు ఉండగా ఈ ఏడాది రూ.172.30 కోట్లు కేటాయించారు. ఇక అప్రాధాన్య రంగాలకు కిందటేడాది రూ.500కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది మాత్రం రూ.2876.43కోట్లు కేటాయించారు. ఈ సారి ఏకంగా రూ.2376.43కోట్లు అధికంగా కేటాయించడం గమనార్హం.


రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్, బ్యాంక్, వ్యవసాయ శాఖాధికారులు

లక్ష్యం మేరకు రుణం ఇస్తారా..?

బ్యాంకర్లు ప్రతి ఏటా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్నా వాటి అమలలో మాత్రం పూర్తిస్థాయి కార్యరూపం దాల్చడం లేదని తెలుస్తోంది. కేటాయింపులు చేస్తున్నా కిందటేడాది ఎన్ని కోట్లు రుణాలు అందించారో వివరాలు మాత్రం వెల్లడించడం లేదు. మరోపక్క స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఏయే పంటలకు ఎంత మేరకు రుణం అందించాలో ఆ నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది. మరోపక్క ఎకరానికి రూ.45వేల చొప్పున అందించాల్సి ఉన్నప్పటికీ ఆ మేరకు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ఈఏడాది ఒక్కో రైతుకు రూ.3లక్షలు కటాఫ్‌గా నిర్ణయించారు. ఎన్ని ఎకరాలు ఉన్నా రుణం మాత్రం వారి నిర్దేశించిన ప్రకారమే ఇవ్వడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో పహణీ,నకలు ఉంటే రుణం అందించే బ్యాంకర్లు తాజాగా పట్టాపాస్ పుస్తకం లేనిదే రుణాలు మంజూరు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. మరోపక్క సామాజిక రంగాల్లో అందించే రుణాలను కూడా అర్హులైన పేదలకు కాకుండా పరిచయస్తులు, ధనికులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరోపక్క ఈ ఏడాది ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులకు కొంత ఊరట లభించనుంది. పాత బకాయిలు మాఫీ కావడంతో కొత్తగా రుణం పొందేందుకు ఆస్కారం లభించనుంది.

ప్రతి విద్యార్థి ఇంట్లో మొక్కలు నాటాలి

- నేషనల్ గ్రీన్ కోర్ స్టేట్ కోర్డినేటర్ విద్యాసాగర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
ప్రతి విద్యార్థి స్థలాన్ని బట్టి ఇంట్లో మొక్కలు నాటాలని నేషనల్ గ్రీన్ కోర్ స్టేట్ కోర్డినేటర్ విద్యాసాగర్ సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీర్ కోర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. శనివారం పట్టణంలోని డైట్ కళాశాలలో విద్యార్థులకు భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకునే అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో అవగాహన పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. చెట్లు లేక స్వచ్ఛమైన గాలి లభించక అనేక వ్యాధులకు గురవుతున్నామన్నారు. బాధ్యతగా ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఒకటి లేదా రెండు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ కంటె నర్సయ్య, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబంధుపై రైతుల అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-బోథ్
మార్కెట్ యార్డ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా, రైతుబంధు పథకంపై రైతుల నుండి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏడీఏ పుల్లయ్య మాట్లాడుతూ అభిప్రాయాలు తెలుసుకొని పై అధికారులు పంపిస్తామన్నారు. అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి ప్రతి రైతుకు ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ, సహకార సంఘం అధ్యక్షులు కదం ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు గొర్ల రాజు, ద్యాగల నారాయణ, లోలపు పోశెట్టి, ఇదాపు మనోహర్, చట్ల ఉమేష్, కోల రాజేశ్వర్, పీఏసీఎస్ సీఈఓ గోలి స్వామి, రైతులు పాల్గొన్నారు.

తాబేలు అప్పగింత



నవతెలంగాణ-కాగజ్‌నగర్
కాగజ్‌నగర్ పట్టణం గుంటూరు కాలనీకి చెందిన గజ్జి మహేష్ ఇంటి ఆవరణలోకి వచ్చిన తాబేలును శనివారం అటవీ అధికారులకు అప్పగించారు. ఉదయం ఇంటి ఆవరణలోకి తాబేలు రాగా మహేష్-గీత దంపతులు దానిని అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లి ఇన్‌ఛార్జి ఎఫ్‌డీఓ అప్పలకొండకు అప్పగించారు. దానిని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. వన్యప్రాణులను కాపాడడం అందరి బాధ్యత అని, అవి ఎక్కడ కనిపించినా వాటి సమాచారాన్ని వెంటనే అటవీ అధికారులకు అప్పగించాలని ఈ సందర్భంగా అప్పలకొండ సూచించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్ఆర్ఓ రమాదేవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


చుక్కల దుప్పిని వేటాడిన కేసులో నలుగురి అరెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్
కాగజ్‌నగర్ అటవీ రేంజ్ పరిధిలోని వేంపల్లి బీట్‌లో చుక్కల దుప్పిని వేటాడి చంపిన కేసులో నలుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు కాగజ్‌నగర్ ఎఫ్ఆర్ఓ రమాదేవి తెలిపారు. సిర్పూరు మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన చిట్లం భిక్షపతి, చిట్లం చిలకయ్య, చిట్లం నాగేష్, కన్నెపెల్లి రమేష్‌లు చుక్కల దుప్పిని వేటాడి హతమార్చారని, వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఓ శశిధర్‌బాబు, ఎఫ్‌బీఓ విజయచంద్ర పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అస్తమయం

- జడ్పీ ఛైర్మెన్, ఖానాపూర్ ఎమ్మెల్యేగానూ సేవలు
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర
- సంతాపం తెలిపిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు
- నేడు ఉట్నూర్‌లో అంత్యక్రియలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, ఉట్నూర్
ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆయన ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శనివారం కుటుంబ సభ్యులు హైదరాబాదు తరలించారు. మార్గమధ్యలో ఇచ్చోడ వద్ద మధ్యాహ్నం 12.30గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఇచ్చోడ నుండి పార్థివదేహాన్ని ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం ఆయన ఉట్నూర్ ఎక్స్‌రోడ్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కాగా ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం ప్రకటిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజకీయాల్లో తనదైన ముద్ర


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రమేష్ రాథోడ్ అట్టడుగు స్థాయి నుంచి రాజకీయ నాయకుడుగా ఎదుగుతూ వచ్చారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామానికి చెందిన ఆయన అక్టోబర్ 20, 1966లో జన్మించారు. ఆదిలాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. నార్నూర్ జెడ్పీటీసీగా పనిచేశారు. 1999-2004 మధ్య ఖానాపూర్ ఎమ్మెల్యేగా సేవలందించారు. 2006 నుండి 2009 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 2009లో టీడీపీ తరఫున ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. అదే సమయంలో ఆయన సతీమణి సుమన్ రాథోడ్ ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్ఎస్ లో చేరారు. ఆ తర్వాత గులాబీ గూటిని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం కొద్దికాలం పాటు ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మళ్ళీ జూన్ 2021లో ఈటెల రాజేందర్‌తో పాటు బీజేపీలో చేరారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్ళీ అదే పార్టీ నుండి ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ దక్కలేదు. జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీ ఛైర్మెన్ వంటి పదవులు చేపట్టిన ఆయన ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. టీడీపీలో కీలక పదవిగా భావించే పొలిట్‌బ్యూరో సభ్యుడిగానూ పనిచేశారు.

సీఎంలు, కేంద్రమంత్రుల సంతాపం

మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతి పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు సంతాపం ప్రకటించారు. జిల్లాలో ఆయన చేసిన సేవలు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వీరితో పాటు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుపటేల్, రామారావుపటేల్, అనిల్‌జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎంపీ సోయం బాపురావు, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, టీపీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవార్ జితేందర్, ప్రవీణ్‌కుమార్‌లు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ

ఆపరేషన్ వికటించి బాలిక మృతి

- ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన


కుటుంబ సభ్యుల ఆందోళన


పల్లవి(ఫైల్)

నవతెలంగాణ-భైంసా
పట్టణంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో ఆపరేషన్ వికటించి బాలిక మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్య కారణంగానే బాలిక మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు. కుభీర్ మండలానికి చెందిన పల్లవి(14)కి కడుపు నొప్పి రావడంతో కుటుంబీకులు భైంసాలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. స్కానింగ్ ఆధారంగా అపెండిసైటిస్ ఉందని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. దీంతో శుక్రవారం రాత్రి డాక్టర్ బృందంతో ఆపరేషన్ చేశారు. శనివారం బాలిక మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే పల్లవి మృతి చెందిందని, వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టడంతో విషయం తెలుసుకున్న సీఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరగా, న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సీజన్‌లో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్
- సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్
వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 15 అంశాలపై చర్చ జరగ్గా 14 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. 4వ అంశం అయిన గతంలో టెండర్ వేసి షాపులను వేలం వేశామని, అద్దెకు ఇవ్వడానికి ప్రతిపాదించగా దాన్ని సభ్యులు వ్యతిరేకిస్తూ తొలగించాలని కోరుతూ ఛైర్మెన్‌కు వినతిపత్రం అందించారు. ముందుగా ఇటీవల మరణించిన మున్సిపల్ కార్మికుల ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అలాగే పదవి విరమణ పొందుతున్న పలువురిని కౌన్సిల్ సభ్యులు శాలువాతో సత్కరించి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మెన్ మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమైన సందర్భంగా పట్టణంలో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూస్తామన్నారు. కాలనీల్లో ఆయిల్ బాల్స్‌తో పాటు పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. 15 అంశాలపై జరిగిన సమావేశంలో సభ్యులు 14 అంశాలను అమోదించారన్నారు. షాపుల కేటాయింపులో పారదర్శకత లేదని సభ్యులు దాన్ని వ్యతిరేకించారని తెలిపారు. దాన్ని తొలగించి 30 సంవత్సరాల కాలం అయిన 40 షాపులతో పాటు గతంలోని 7 షాపులను కలిపి టెండర్ వేస్తామని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వైస్ ఛైర్మన్ జహీర్ రంజానీ, డీఈ తిరుపతి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

రమేష్ రాథోడ్ మృతి పట్ల మహేశ్వర్‌రెడ్డి సంతాపం

నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు, బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ హఠాన్మరణంపై నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం బీజేపీకి తీరని లోటని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఉమ్మడి



ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్‌గా, ఎమ్మెల్యే, పార్లమెంట్ సభ్యులుగా ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల అభ్యున్నతికి అండగా నిలిచారన్నారు. రమేష్ రాథోడ్ అకాలమరణం అందరిని కలచివేసిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని కోరుకున్నారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

పేకాటాడుతున్న ఏడుగురు అరెస్టు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మలక్ చించోలి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న 7 గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మలక్ చించోలి గ్రామంలోని వైకుంఠదామం దగ్గర్లో పేకాట ఆడుతున్నా 7 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి దగ్గిరి నుంచి రూ.8వేల 660, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెల్లడించారు.



బొగ్గు గనుల వేలం ఆపి సింగరేణికి అప్పగించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకును కేంద్ర బీజేపీ ప్రభుత్వం వేలం ఆపాలని, నేరుగా సింగరేణి కంపెనీకి అప్పగించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బొగ్గు గనుల ప్రయివేటికరణ వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వరకు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన, ప్రభుత్వరంగ సంస్థ అని సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలన్నారు. కానీ వేలంపాట ద్వారా ప్రయివేటు సంస్థలకు అవకాశం ఇస్తున్నదన్నారు. ఇప్పటికే నాలుగు బ్లాకులు గత బీఆర్ఎస్ పాలనలోనే మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించిందని, రాష్ట్రం నుంచే బొగ్గుగనుల శాఖా మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించటం అన్యాయమన్నారు. పైగా సింగరేణిని ప్రయివేటీ కరించబోమని బుకాయించారన్నారు. బొగ్గు బ్లాకులన్నీ ప్రయివేట్ సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముందని, క్రమంగా సింగరేణి సంస్థ బలహీనపడి మూతపడే వైపు మోడీ ప్రభుత్వం నెట్టుతున్నదన్నారు. ఈ ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అడ్డుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కోరుతున్నదని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ (నగదీకరణ) పేరుతో దేశంలో 6లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు కట్టబెడుతున్నదని అందులో భాగంగానే రూ.28,747 కోట్ల విలువైన గనులను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. గత పదేండ్లలో మోడీ ప్రభుత్వం సుమారు 200 బొగ్గు బావులను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టారని దీని ఫలితమే ఇప్పుడు జరుగుతున్న వేలం. దేశవ్యాపితంగా 10వ విడతలో 61 బొగ్గుబావులను వేలం వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి 8 మంది శాసనసభ్యులు, మరో 8మంది పార్లమెంట్ సభ్యులు ఉండి కూడా తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే నోరు మెదపటం లేదన్నారు. ప్రస్తుతం సింగరేణి 40వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పించిందని, రికార్డు స్థాయిలో తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నదన్నారు. గత పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెండ్ రూపంలో రూ.49,666 కోట్లు చెల్లించింది. ఇందులో కేంద్రానికి రూ.26వేల కోట్లు చెల్లించగా, రాష్ట్రానికి రూ.23వేల కోట్లు చెల్లించిందన్నారు. ఒకవైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, మరోవైపు ప్రభుత్వాలకు ఆదాయపు వనరుగా ఉన్నదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి బొగ్గు కొనుగోళ్లు, కరెంట్ బిల్లు రూ.29వేల కోట్లు బకాయి పడింది.

అయినప్పటికీ సింగరేణి రూ.35వేల కోట్ల టర్నోవర్తో లాభాల బాటలో నడుస్తున్నదని అన్నారు. యేటా రెండు నుంచి మూడువేల కోట్ల రూపాయలు లాభాలు ఆర్జిస్తున్నదని తెలిపారు. వేలం పాట ప్రారంభం కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యకరమన్నారు. ఇది వేలంపాట ప్రక్రియను ఆమోదించడమే కదా అని అన్నారు. గతంలో ప్రయివేటు సంస్థలకు అప్పగించిన మరో రెండు బ్లాకుల్లో ఇప్పటికీ తవ్వకాలు ప్రారంభం కాలేదన్నారు. అందువల్ల శ్రావణపల్లి బ్లాకుతో పాటు, ఆ రెండు బ్లాకులను కూడా తక్షణం సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకుని కేంద్రం మీద ఒత్తిడి చేయాలన్నారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలని, కేంద్రం ఆమోదించకపోతే రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. కేవలం విజ్ఞప్తులతో సరిపెట్టవద్దని, సింగరేణి పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను సమాయత్తం చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్రాత్రి, కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, కిరణ్, సచిన్, నాయకులు మంజుల, స్వామి, ఆశన్న, పోచక్క పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- డీపీఓ శ్రీనివాస్



నవతెలంగాణ-సారంగాపూర్

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, విభాగ పంచాయతీ అధికారి రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బోయవాడను సందర్శించి, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి కాలనివాసులకు వివరించారు. వాడని పాతకూలర్, కొబ్బరి బోండాలు, పాత బకెట్‌లు, టైర్‌లు, ప్లాస్టిక్ డబ్బాలు, రంజన్లు మొదలగు వస్తువులలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వాటి నుంచి నీటిని తొలగించాలి. ఇంటితో పాటు ఇంటి చుట్టూ ప్రక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని దుకాణాలు వృత్తి వ్యాపారాల లైసెన్స్‌లను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని దుకాణాలకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వీరి వెంట ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచాలి

- డీఐఈఓ పరశురాం



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఐఈఓ పరశురాం అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేట్టు చూడాలని, హాజరు శాతం పెంచాలన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇప్పటి నుండే ఎంసెట్ క్లాసులు తీసుకోవాలన్నారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

భోజనంతో పాటు మంచి విద్యను అందించాలి

- డీడీ దిలీప్ కుమార్

నవతెలంగాణ-నార్నూర్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను సూచించారు. శనివారం గాదిగూడ మండల కేంద్రంలోని బాలురు, ఝరి బాలురు ఆశ్రమ పాఠశాల, అర్జుని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిక ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు వంటగది వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని సూచించారు. తరగతి గదిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పూర్తయిన పాఠాలపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావ్, వందన, పాఠశాల సిబ్బంది సురేందర్, బాబు, పీడీ జలపత్, సుంగు, ఆచంత్ ఉన్నారు.

మాదకద్రవ్యాల కేసుల్లో పరిశోధనలు కీలకం

- ఎస్పీ గౌస్ ఆలం
- పోలీసు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాలపై పూర్తి కట్టుదిట్టమైన చర్యలతో పోలీసు యంత్రాంగం విధులను నిర్వర్తిస్తున్న సమయంలో నేరస్థులకు శిక్షలు పడేలా కఠినమైన చర్యలు తీసుకుంటూ సంపూర్ణంగా దర్యాప్తును నిర్వర్తిస్తూ, చార్జిషీట్లు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. మాదకద్రవ్యాల కేసులలో మరింత పరిజ్ఞానాన్ని, పరిశోధనలు పెంపొందించేందుకు జిల్లా ప్రత్యేక పీపీ ముస్కు రమణారెడ్డి ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని శనివారం హెడ్ క్వార్టర్స్‌లో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది అందరికీ దర్యాప్తు పరిశోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మాదకద్రవ్యాలపై కేసులు చేసేటువంటి సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు చార్జిషీటు దాఖలు చేసేటువంటి అధికారులకు, స్టేషన్ రైటర్లకు పూర్తి అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల కేసులలో ముఖ్యంగా పరిశోధన ఎలా చేయడం, కేసు నమోదు ఏయే పరిస్థితులను బట్టి చేయడం, దర్యాప్తు నిర్వహించి చార్జిషీట్ దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. దర్యాప్తు పక్కగా నిర్వహించి, పూర్తి నివేదికను చార్జిషీట్ నందు దాఖలు చేసినప్పుడే నేరస్తులపై కఠినమైన చర్యలు తీసుకొని సరైన శిక్షలు పడతాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా శాలువా, బహుమతితో సత్కరించారు. ఎటువంటి సందేహాలకైనా సమస్యలకైనా తనను సంప్రదించవచ్చని ప్రత్యేక పీపీ ముస్కు రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్స్, ఐటి కోర్, డీసీఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెన్ పనులు పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రూరల్ పోలీస్ స్టేషన్ జయశంకర్ సర్కిల్ వద్ద ఉన్న వాటర్ ఫౌంటెన్‌తో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వాటర్ ఫౌంటెన్ ఎత్తును తగ్గించుటకు పనులు జరుగుతున్నాయి. శనివారం వాటర్ ఫౌంటెన్ పనులను జిల్లా ఎస్పీ జి.జానకీ షర్మిల, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి పరిశీలించారు. వాటర్ ఫౌంటెన్ ఎత్తు పెద్దదిగా ఉండటంతో ఒక్క వైపు నుంచి వచ్చే వాహనం, ఎదురుగా వచ్చే వాహనం సరిగ్గా కనపడకుండా, ప్రమాదాలు జరుగుతున్నాయని దృష్టిలో పెట్టుకుని ఫౌంటెన్ ఎత్తును తగ్గిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, గండ్రత్ రమణ, మేడారం అపర్ణ ప్రదీప్, తౌహీద్ ఉద్దీన్ రప్పూ, ఎడిపెల్లి నరేందర్, ముజాయిద్ చౌస్, అబ్రార్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మృతికి పలువురి సంతాపం

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేష్(57) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఆదిలాబాద్ ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి విషమించింది. శనివారం హైదారాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచారు. 1999లో టీడీపీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యే, 2009లో ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు.

మాజీ ఎంపీ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం....

ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈ ప్రాంతంలో ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మెన్, ఎంపీగా సేవలందించారన్నారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేసి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ సంపత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

10ఎకరాలకే రైతుభరోసాకు మద్దతు



నవతెలంగాణ-తలమడుగు

రైతు బరోసాను 10ఎకరాల వరకు కల్పించాలని మండలంలో రైతులు మద్దతు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన రైతు భరోసా సమావేశంలో రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీఓ మోహన్ మాట్లాడారు. 10ఎకరాలకు రైతు భరోసా కల్పించాలని రైతులు కోరినట్టు తెలిపారు. మరి కొంతమంది రైతులు సాగు చేసే వారికే వేయాలని అన్నారు. రూ.2లక్షలు రుణమాఫీ వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతుకు సబ్సీడీపై పైపులు, స్పింక్లర్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఓ మోహన్, చైర్మెన్ దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ వనమాల, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

హైదారాబాద్‌లోని కోటిలో జూలై 3న తలపెట్టిన మహా సభకు కార్మికులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలనీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఉట్నూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒక రోజు సానిటేషన్ సెక్రటరీ, పెషెంట్ కేర్ కార్మికులకు సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రాథోడ్ రమేష్, జాదవ్ కమల బాయి, సంగీత, బాబులాల్, లక్ష్మి కాంత్, సరోజ, పాపయ్య, నాందేవ్, జమున బాయి ఉన్నారు.

కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి

- పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్యన గడపాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. శనివారం పట్టణంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఎస్సై సుంకరి సాయన్న, హెడ్ కానిస్టేబుల్ కే.గణపతిలను శాలువా కప్పి సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, నిరంతరం వ్యాయామం చేస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎస్సై సుంకరి సాయన్న 1984 సంవత్సరంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి అడుగుపెట్టి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తించి, 2012 సంవత్సరంలో ఏఎస్సై 2017 సంవత్సరంలో ఎస్సైగా పదోన్నతి పొంది పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయి స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తించడం జరుగుతుండగా, నేడు పదవీ విరమణ పొందడం జరిగిందన్నారు. అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్ కే గణపతి 1990 సంవత్సరంలో జిల్లాలో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై ఉమ్మడి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో విధులను నిర్వర్తించి, ఎటువంటి రీమార్కులు లేకుండా 2016 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది తాంసి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ, నేడు పదవీ విరమణ పొందడం జరిగిందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం పొందాల్సిన సదుపాయాలను అతి త్వరలో ఏర్పాటు చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని పోలీసు అసోసియేషన్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందే అధికారుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది పాల్గొన్నారు.

గంగ నీళ్లతో గ్రామదేవతలకు అభిషేకం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పిప్రి గ్రామస్తులు శనివారం గంగనీళ్ల పూజచేశారు. గ్రామస్తులు గడముంతలు చేతపట్టి గంగనీళ్ల కోసం గోదావరి నదికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. గడముంతల్లో గంగా నీళ్లు తీసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నారు. గంగా నీళ్లతో గ్రామదేవతలను అభిషేకించి పూజలు చేశారు. మిగిలిన నీటిని ఇంటికి తీసుకెళ్లి ఇండ్లల్లో, పశువుల పాకల్లో చల్లుకున్నారు.

అంకోలిలో డబ్ల్యూహెచ్ఓ బృందం పర్యటన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డబ్ల్యూహెచ్ఓ బృందం సభ్యులు పరిశీలించారు. గర్భిణుల స్క్రీనింగ్, అభా కార్డ్స్, మందుల నిల్వలు, పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఎన్సీడీ అధికారి, సీవీహెచ్ఓ కర్డియో వాస్కులర్ హెల్త్ ఆఫీసర్ డా.అబ్దుల్ వసి, డీఎంహెచ్ఓ, ఎన్సీడీ అధికారి డా.శ్రీధర్, కర్డియో వ్యాస్కులర్ సపోర్టర్ ఆజయ్ సిబ్బంది రమణ, పీహెచ్‌సీ నోడల్ అధికారులు యశోద, బొమ్మెత సుభాష్, సూపర్ వైజర్స్ లక్ష్మీ, శ్యామల, వసంత, 13 సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్ ప్రేమ్‌సింగ్, స్టాఫ్ నర్సులు గంగామణి, ప్రతిమా పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజితండ గ్రామపంచాయతీలో రోడ్డు భద్రతపై ప్రజలకు ఆర్టీసీ డిపో మేనేజర్ సోలేమాన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహన చక్రంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేసి, నూరేండ్ల జీవితాన్ని కాపాడుకోవాలని అన్నారు. శనివారం ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో మేనేజర్‌తో పాటు సిబంది పాల్గొని, జీకే.మూర్తి దంపతులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గణాంక దర్శిని ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2022-23 జిల్లా గణాంక దర్శినిని శనివారం కలెక్టర్ రాజర్షిషా తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఆధ్వర్యంలో అన్ని శాఖల నుంచి సేకరించిన సమాచారాన్ని మండలాల వారిగా రూపొందించారు. ఆవిష్కరణలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ముఖ్య ప్రణాళికాధికారి వెంకటరమణ, ఉపగణాంక అధికారి, మండల గణాంక అధికారులు ఉన్నారు.

పంటల వివరాలు నమోదు

నవతెలంగాణ-పెంచికల్ పేట్



మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో రైతులు వేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారి లావణ్య నమోదు చేశారు. పంట క్షేత్రలకు వేళ్లి పంటల గురించి వివరాలు తెలుసుకుంటు ప్రత్యే యాప్‌లో పొందుపర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకోవడం ద్వారానే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మద్ధతు ధరకు పంటను అమ్ముకోవచ్చని తెలిపారు. పంటకు సంబంధించిన ఏమైనా ఇన్సూరెన్స్‌లున్న వర్తిస్తాయని రైతులకు తెలియజేశారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదివారం పర్యటించనున్నారు. జిల్లా పర్యటన కోసం శనివారం రాత్రి కాగజ్‌నగర్ కేంద్రంలోని ఎస్పీఎం గెస్ట్ హౌస్‌కు చేరుకున్న మంత్రి ఆదివారం ఉదయం 9:50కి కాగజ్‌నగర్ కేంద్రంలోని పల్లె దవఖాన, 10:45కు ఈజ్‌గాం వార్డ్ నెంబర్ 12 లో పల్లె దవఖాన తనిఖీ చేసి అక్కడినుండి 11:40కి రెబ్బెన మండలం నవేగాం, 12:05 రెబ్బెన మండల కేంద్రంలోని పల్లె దవఖాన తనిఖీ చేసినంతరం గంగాపూర్ కేజీబీవీ పాఠశాల కార్యక్రమంలో పాల్గొని అక్కడినుండి ఆసిఫాబాద్ వచ్చే క్రమంలో ఖైరిగాం పల్లె దవఖాన సందర్శించనున్నారు. మధ్యాహ్నం 1:15కు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలను సందర్శించి జిల్లా కేంద్రంలో భోజన విరామం తర్వాత 3:30కి సిర్పూర్(యు) కేజీబీవీ సందర్శన అనంతరం ఆదిలాబాద్ బయలుదేరి వెళ్తారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఇప్పటికే అధికారులు, పార్టీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లా సమాచారం అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా సమగ్ర సమాచారాన్ని అధికారులు ప్రజలకు చేరువచేయాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సమగ్ర గణాంక హ్యాండ్ బుక్‌ను ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళికా అధికారి పాపయ్యతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. హ్యాండ్ బుక్‌లో ఉన్న వివరాలను, సమాచారాన్ని అధికారులు, ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని తెలిపారు. జిల్లా పూర్తి సమాచారాన్ని హ్యాండ్ బుక్‌లో పొందుపరచాలన్నారు. వాతావరణ వివరాలను ప్రతిరోజు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్, మండలాల గణాంక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో నెల రోజుల క్రితం వంకులం గ్రామానికి చెందిన రెడ్డి ప్రవీణ్ అనే యువకుడు సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి దాన్ని గుర్తించారు. కాగా శనివారం బాదితుడికి స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను అందించినట్టు ఎస్సై కొమురయ్య తెలిపారు. సాంకేతిక పెరిగిన నేపథ్యంలో పోయిన ఫోన్లను సీఐఆర్‌లో నమోదు చేసి గుర్తిస్తున్నామని పేర్కొన్నారు.

జిల్లాతో రమేష్ రాథోడ్ అనుబంధం చిరస్మరణీయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాతో రమేష్ రాథోడ్ అనుబంధం చిరస్మరణీయమైనదని జిల్లా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవలక్ష్మి, జడ్పీటీసీ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం సమయంలో రమేష్ రాథోడ్ మరణ వార్త తెలియడంతో సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ నుండి జడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్‌గా పని చేశారని అన్నారు. నార్నూరు మండలం తాడిహత్నూరులో జన్మించిన ఆయన 1999-2004లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేసే అనంతరం 2006లో ఆసిఫాబాద్ జడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా 2009 వరకు పనిచేశారని తెలిపారు. రమేష్ రాథోడ్ ఎంతో సేవ చేశారని సభ్యులు కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

శివాలయానికి ముస్లిం యువకుని విరాళం

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయానికి ముస్లీం యువకుడు విరాళం అందించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సయ్యద్ గౌస్ ఆలయానికి రూ.30 వేల విలువచేసే ఇన్వర్టర్‌ను అందించి మతసమరస్యాన్ని చాటాడు. ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నందున కరెంటు సమస్య ఉందని ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోషా తెలియజేయడంతో స్పందించిన గౌస్ తన సొంత డబ్బుతో ఆలయానికి ఇన్వర్టర్ తెచ్చి ఇచ్చాడు. సయ్యద్ గౌస్ వృత్తిరీత్యా మండల కేంద్రంలో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నాడు. ఒక ముస్లీం సోదరుడు హిందూ దేవాలయానికి ఈ ప్రాంతంలో ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వడం ఇదే మొదటిసారి. మతసమరస్యాన్ని చాటిన గౌస్‌ను పలువురు హిందువులు అభినందించారు. భక్తితో కొలిచిన దేవుడు అందరికీ సమానమేనని దేవుని పూజించే మనమంతా ఒక్కటేనని హిందూ ముస్లీం తేడా లేకుండా అందరం కలిసి మెలిసి ఉండాలని గౌస్ కోరారు. మునుముందు కూడా తనకు దోచిన సాయం అందిస్తానని తెలిపారు.

రేపు వారసంత వేలం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంత వేలం పాటను సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ కోట ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రెటరీ ఆసిఫ్ అలీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార సంత వేలం పాట 2024-25 సంవత్సరానికి గాను జూలై 2024 నుంచి మార్చి 2025 వరకు వేలం పాటలో పాల్గొనవచ్చు అన్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి రూ.20వేల డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అధికారుల సహకారం మర్చిపోనిది

- జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ
- జిల్లా ప్రజలు అవకాశమిచ్చారు ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం



జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, జడ్పీ సభ్యులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గడిచిన ఐదేండ్లలలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిలో అధికారుల సహకారం మర్చిపోలేనిదని జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం వచ్చే నెల 5తో ముగుస్తున్న నేపథ్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే కోవలక్ష్మీతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావం తర్వాత ఏర్పడ్డ మొట్టమొదటి జిల్లా పరిషత్‌కు జిల్లా అధికారులు ఎంతగానో సహకరించారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆరు నెలల కాలం మాత్రమే పని చేసినప్పటికీ ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. అధికారులను ప్రజా సమస్యలపై పలు సందర్భాల్లో నిలదీయడం జరిగిందని, ఇది కేవలం ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఉద్దేశంతో మాత్రమే చేసిందని వేరేలా భావించకూడదన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ జిల్లా ప్రజలను తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ఇప్పటివరకు ప్రతిసారి తనకు మంచి అవకాశాలు ఇచ్చారని ప్రజల రుణం తీర్చుకోవడం తన బాధ్యత అని తెలిపారు. జడ్పీటీసీలు జిల్లా అధికారుల పనితీరును కొనియాడారు. జడ్పీటీసీ అజయ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను గుర్తుచేసుకొని కాసింత ఉద్వేగానికి గురయ్యారు. జిల్లా రహదారులు భవనాల శాఖ అధికారి పెద్దన్న మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు పనులు చేయాలని అధికారులను అడగడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు కూడా తీసుకురావాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చురకలు అంటించారు. డీఆర్‌డీఓ సురేందర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో తనకున్న అనుబంధం మరిచిపోలేనిదని గుర్తు చేశారు. అనంతరం జడ్పీటీసీలు, ఎంపీపీను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలి

- జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) నిరసన



అంబేద్కర్ చౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం సింగరేణిని నిర్వీర్యం చేయాలని చూస్తే తెలంగాణ మరో ఉద్యమం చేయాల్సి ఉంటుందని, బొగ్గు గనుల వేలం పాటను నిలిపి వేసి నేరుగా గనులను సింగరేణికి కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రయివేటు సంస్థలతో పాటు వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలన్నారు. కానీ వేలంపాట ద్వారా ప్రయివేటు సంస్థలకు అవకాశం ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల శాఖ మంత్రి రాష్ట్రానికి చెందిన వాడు అయినప్పటికీ సింగరేణికి రావాల్సిన గనులు ప్రయివేట్‌కు కట్టబెట్టాలని చూడడం దారుణమని ఆరోపించారు. పది సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం 200 బొగ్గు గనులను ప్రయివేటు సంస్థలకు అప్పగించిందని దానిలో భాగంగానే శ్రావణపల్లి బొగ్గు గనులను కూడా అప్పగించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. పదో విడతలో 61 బొగ్గు గనులను వేలం వేస్తున్నారని దీనిలో రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు బీజేపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, నాయకులు గేడం టికానంద్, కోరెంగ మాల శ్రీ, జాడి తిరుపతి, నిఖిల్, శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మత్స్యకారులకు ఆర్థిక పరిపుష్టి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చేపల పెంపకం ద్వారా మంచి లాభాలను పొందవచ్చని మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి ఇది తోడ్పడుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్సకారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలను ఉపయోగించుకుని చేపల పెంపకం ద్వారా లాభాలను పొందవచ్చునని తెలిపారు. చేపల సాగుకు 2 ఎకరాల స్థలం, బోర్ సదుపాయం ఉండాలన్నారు. నేడు వస్తున్న నూతన టెక్నాలజీ ద్వారా ఇంటి మిద్దెలు, వ్యవసాయ క్షేత్రాల్లోనూ ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటు చేసి కూడా సాగుచేయవచ్చునని అన్నారు. చేపల పెంపకానికి రూ.5 లక్షల పెట్టుబడి, 4 గుంటల స్థలం, సంవత్సరానికి 3 పంటలు, రూ.2 లక్షల ఆదాయం, ఒక రైతుకి లబ్ది చేకూరుతుందన్నారు. దీనినే 5, 4, 3, 2, 1గా సూత్రీకరించి తెలుపుతారని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళాలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నో రాయితీలు, సబ్సిడీలు కల్పిస్తుందని తెలిపారు. ఇంటి మిద్దెలపై చేపల సాగు చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చునన్నారు. చేపల పెంపకంలో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. మార్కెటింగ్ కూడా సులభంగా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అలాగే చేపల పెంపకానికి ఉపయోగించిన నీరు మొక్కలకు సేంద్రియ ఎరువగా ఉపయోగపడుతుందని, యూరియా తక్కువ మోతాదులో అందిస్తే సరిపోతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అడిషనల్ డిఆర్డీఓ రామకృష్ణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, ఇన్‌చార్జీ జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు త్రివేణి, కన్సల్టెంట్ ఉదయ్ కిషోర్, మత్స్యకార్మికులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

రాయితీ బస్‌పాస్ సద్వినియోగం చేసుకోవాలి



బస్‌పాస్ దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ, ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం దివ్యాంగులకు రాయితీపై అందించే బస్సు పాస్ సౌకర్యాన్ని మండలంలోని దివ్యాంగులు ఉపయోగించుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్టీసీ ద్వారా దివ్యాంగులకు రాయితీ బస్సు పాస్ కోసం స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో 62 మంది దరఖాస్తు చూసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులు సమాజంలో అందరితో సమానంగా జీవించాలని, సంక్షేమానికి ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వీటిని ప్రతి ఒక్క దివ్యంగుడు ఉపయోగించుకొని సమాజంలో తమకంటూ ఒక గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వాటి గురించి తెలుసుకుంటు ఇతరులు కూడా వినియోగించేల అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి సందేహాలున్న అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఇప్ప రవి శంకర్, ఆర్టీసీ సిబ్బంది దుర్గం తులసిరాం, జుమిడి పెంటయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలి

- ఏసీఎంఓ ఉద్ధవ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంగ్లీష్ భాషాభివృద్ధి నైపుణ్యాలను ప్రతి ఉపాధ్యాయుడు పెంపొందించుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంఓ) ఉద్ధవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండవ రోజు ఆ శాఖ ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మాధ్యమం నుంచి ఇంగ్లీష్ మీడియంలో పాఠశాలల నిర్వహణ నేపథ్యంలో ప్రతి ఉపాధ్యాయుడు ఇంగ్లీష్ భాషపై మంచి పట్టు సాధించాలన్నారు. పదవ తరగతిలో ఈ విద్యా సంవత్సరం 100శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం శిక్షణ కోర్సు డైరెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, డీఆర్పీ వామన్ రావు, రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్ మధు, సుజాత, సామాన్య సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనులో గడ్డి మందు పిచికారి చేశారని ఫిర్యాదు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని మరితీడు శివారు ప్రాంతాల్లోని గజ్జల సురేష్‌కు చెందిన పత్తి చేనులో బిక్షపతి గౌడ్ అనే వ్యక్తి గడ్డి మందు పిచికారి చేసి పత్తి మొక్కలను నాశనం చేశాడని ఫిర్యాదు చేశారు. బాదితుడు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తన పక్క చేనులోని వ్యక్తి గడ్డి మందు పిచికారి చేయడంతో తన చేనులోని పత్తి మొక్కలు చనిపోయి సుమారు రూ. రెండు లక్షల నష్టం వాటిల్లిందని దీనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపినట్టు బాధితుడు గజ్జల సురేష్ తెలిపారు.

డిపో అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- డిపో మేనేజర్ విశ్వనాథ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ డిపో అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంటుందని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపోలో ప్రగతి చక్రం అవార్డు కార్యక్రమంలో భాగంగా మంచి ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు సంబంధించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. డిపోకు ఆదాయం తేవడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీలో పనిచేసి ఈ నెలలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు డిపో మేనేజర్ విశ్వనాథ్ సన్మానించారు. ఉద్యోగుల శేష జీవితాల్లో పిల్లాపాపలతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజ్ సూపర్‌వైజర్ ఉదయ్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, టీఐ 3 భారతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీకి పితృవియోగం

నవతెలంగాణ-చింతలమనేపెల్లి

మండల ఎంపీపీ డుబ్బుల నాన్నయకు పితృవియోగం కలిగింది. శనివారం ఉదయం ఎంపీపీ తండ్రి పోచయ్య అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు కుటుంబ సభ్యులను పరామర్శించి పోచయ్యకు నివాళి లర్పించారు. కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి కోనేరు రమాదేవి, మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, చింతలమానేపల్లి మండల నాయకులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నపాటి వర్షానికి నిలిచిన నీరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి పలుచోట్ల నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుమురం భీం చౌక్ వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. శనివారం మార్కెట్ కావడంతో వివేకానంద చౌక్ వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒకవైపు నీరు నిలవడంతో పట్టణ ప్రజలు వాహనదారులు, పాదచారులు పరేషాన్ అయ్యారు. జిల్లాగా ఆవిర్భవించినప్పటికీ జిల్లా కేంద్రంలోని పలు రహదారులు బురదమయంగా మారడం నీరు నిలవడంతో ప్రజల ఇబ్బందులు తీరడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం దీనిపై పట్టించుకోకపోవడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సంతలకు వేలం పాట పూర్తి

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని పశువులు, కూరగాయల సంతలకు శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయి క్రిష్ణ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు వేలం పాటలో పాల్గొన్నారు. పశువుల సంతకు రూ.1100000 లక్షలు, కూరగాయల సంతకు రూ.420000 పాట పాడి దక్కించుకున్నారు. 2024-2025కి గాను వేలం పాట దారులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | జూన్ 30, 2024 | www.navatelangana.com

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై పదవి విరమణ పొందిన ఉద్యోగి మేడ సమ్మయ్యకు సింగరేణి అధికారులు, నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానం చేశారు. పూలమాలలు, శాలవాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపకలు అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ భూశంకరయ్య, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, ఐఎన్టీయూసీ క్రమ శిక్షణ సంఘం చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, రాపర్తి శ్రీనివాస్, బైరి శంకర్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కనుకుల తిరుపతి, కష్ణ, బాణోత్ తిరుపతి, సంక్షేమ అధికారి మీర్జా గౌస్, అండర్ మేనేజర్ నిఖిల్ పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట గనిపై అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత సింగరేణి ఉద్యోగి బన్న లక్ష్మన్‌దాస్‌కు కాసిపేట గని ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. పూల మాలలు, శాలవాలతో సన్మానం చేశారు. సింగరేణి ఉద్యోగం చేస్తూనే గత 25 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న లక్ష్మణ్ దాస్‌కు జాతీయ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ భూ శంకరయ్య, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి ఓడ్నాల రాజన్న, దూట శ్రీనివాస్, సోల్లంకి శ్రీనివాస్, బైరి శంకర్, బాణోత్ తిరుపతి, తోకల రమేష్, దుర్గం శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-జన్నారం

మండల లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో లైన్స్ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెండవ ఉప గవర్నర్ లయన్ మోర బద్రేశం, రీజియన్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రీజియన్ సెక్రెటరీ అను ముల రాజన్న, రీజియన్ ట్రెజరర్ జక్కు భూమేష్, జోనల్ చైర్‌పర్సన్ అంజితరావు పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షుడు కస్తూరి సతీష్ కుమార్, కార్యదర్శి కొముురవెల్లి సందీప్ కుమార్, ట్రెజరర్ కసావతి జగదీష్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ తోట లచ్చన్న, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌రావు, మెంబర్షిప్ డైరెక్టర్ సురేష్, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ శెట్టి రాజశేఖర్, క్లబ్ సర్వీస్ కోఆర్డినేటర్ మల్యాల బాబు, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ వావిలాల రాజేందర్, అడ్మిన్ సైన్ల మల్లేష్, క్లబ్ కోఆర్డినేటర్ మేగజైన్ రాంసింగ్, ఫ్యామిలీ ఉమెన్ మెంబర్షిప్ జాజాల శ్రీనివాస్, డైరెక్టర్లుగా మారుతి రాజు, ప్రవీణ్ కుమార్, గుండె పవన్, కొమురవెల్లి లచ్చన్న ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

పదవీ విరమణ పొందుతున్న ఎస్ఓ టు జీఎం పురుషోత్తంరెడ్డిని శనివారం జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ 42 సంవత్సరాల 5 నెలల సుదీర్ఘ సర్వీస్ చేసిన వి పురుషోత్తంరెడ్డి అభినందనీయులని, సింగరేణి సంస్థ అభివృద్ధిలో వారు చేసిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలని, అలాగే వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఎస్ఆర్పీ ఓసీ గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, కార్యాలయ పీట్ కార్యదర్శి రామ్ చందర్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జన్నారం

బెల్లంపల్లి పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించే సీపీఐ(ఎం) శిక్షణ తరగతులకు శనివారం ఆ పార్టీ మండల కార్యదర్శి కనికరం అశోక్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బయలుదేరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కూకటికారి బుచ్చయ్య, మగిడి జయ, కొండగుర్ల లింగన్న, లక్ష్మణ్, గుడ్ల రాజన్న, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

సోదరభావంతో కలిసి జీవించాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రజలంతా సోదరా భావంతో కలిసిమెలిసి జీవించాలని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రశీధర్‌రావు అన్నారు. శనివారం తాండూరు మండలంలోని రేచీని గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కులమత ప్రాంత విభేదాలు వినడానికి సోదరా భావంతో కలిసిమెలిసి జీవించాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టిలో ప్రజలంతా సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-దండేపల్లి

నిలిపి వెంకటప్ప సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించి మండల రైతులకు రైతు భరోసాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకంపై అనుసరించాల్సిన విధివిధానాలపై రైతుల నుంచి సూచనలు అభిప్రాయాలను అధికారులు సేకరించారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని సాగర సంగం చైర్మన్ సంగతి కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ లింగన్న, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

4న మహాధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని ఇందిర పార్క్ ఎదుట జులై 4న నీట్ ఫలితాలలో జరిగిన అవకతవకలపై చేపట్టనున్న మహాధర్నా విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. పేపర్ లీకేజీపై నరేంద్ర మోడీ బాధ్యతవహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలపై దేశప్రధాని మోడీ స్పందించక స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(నీట్) చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని అన్నారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులు సమాధానం సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధానకార్యదర్శి కుమ్ర అశోక్, నాయకులు శ్రీవర్షిణి, శృతి, మల్లీశ్వరి, అనూష, ఐశ్వర్య, భూమిక, అనిల్, సంతోష్, శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

సొనాలలో నాణేల ప్రదర్శన

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని శనివారం 40 దేశాల కరెన్సీ నాణేలను అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ బాసెట్టి పిల్లలకు నాణేల ప్రదర్శించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన మహనీయుల, జయంతి, వర్ధంతిలా నాణేలు, నిజాంల నాటి నాణాలు 1905, 1910, బ్రిటిష్ వారి నాణేలు, మొగల్ పాలకుడు అక్బర్ 1556-1605 నాటి రాగి నాణాలు ప్రదర్శించారు. గత చరిత్రను నాణేల ద్వారా భావితరాలకు అందించడమే తన ఉద్యేశమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్ సచిన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ మండలంలో భారీ వర్షం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఉట్నూర్‌లో మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడినా ప్రజలు మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్ల బడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. భారీ వర్షం రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

● మందమర్రి ఏరియా జీఎం మనోహర్

నవతెలంగాణ-కాసిపేట



రక్షణతో కూడిన అధిక ఉత్పత్తిని సాధించాలని మందమర్రి జీఎం మనోహర్ పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో నూతనంగా వచ్చిన రెండు ఎస్డీఎల్ యంత్రాలను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసిపేట-2 గనికి రెండు కొత్త ఎస్డీఎల్ యంత్రాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒక్కో ఎస్డీఎల్ యంత్రాన్ని రూ.52 లక్షలు వెచ్చించి మందమర్రి ఏరియాకు 12 నూతన ఎస్డీఎల్ యంత్రాలను యాజమాన్యం మందమర్రి ఏరియాకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 8 యంత్రాలు ఏరియాకు రావడం జరిగిందని, ఇందులో 2 యంత్రాలను కాసిపేట-2 గనికి కేటాయించడం జరిగిందన్నారు. త్వరలో మిగతా 4 ఎస్డీఎల్ యంత్రాలు కూడా ఏరియాకి వస్తాయన్నారు. క్రొత్త ఎస్డీఎల్ యంత్రాలతో రక్షణతో కూడిన అధిక ఉత్పత్తిని సాధించాలన్నారు. అనంతరం జీఎం గనిలో అండర్ గ్రౌండ్‌లో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రామదాసు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, గ్రూప్ ఇంజనీర్ రాంప్రసాద్, ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌ను సందర్శించిన ఐటీడీఏ పీఓ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ అటవీ ప్రాంతాన్ని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా శుక్రవారం సందర్శించారు. గేట్ నెంబర్-1 నుంచి గోండుగూడ మల్యాల్ నుండి బైసన్ కుంటకు జంగల్ సఫారీలో వెళ్లి అడవి ప్రాంతాన్ని తిలకించారు. సఫారీలో స్లోత్ బేర్లు, చింకారలు, స్పాటెడ్ డీర్, బైసన్, వంటి వన్య ప్రాణులను, సర్పెంట్ ఈగల్, హాక్ ఈగల్, వైట్-థ్రోటెడ్ కింగ్ఫిషర్, అలెక్సాండ్రీన్ పేరాకీట్లు, ప్లం-హెడెడ్ పేరాకీట్లు, బ్లాక్ డ్రాంగో, కాలర్డ్ డవ్, స్పాటెడ్ డవ్ వంటి వివిధ పక్షులను చూసి టైగర్ జోన్ అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేయాలని అటవీ అధికారులకు సూచించారు. జంగల్ సఫారీ టూర్ బాగుందని ఆనందం వ్యక్తపరిచారు. ఆమె వెంట వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఎస్టీపీపీ జీఎంకు సన్మానం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థలో 38 సంవత్సరాల సుదీర్ఘ సేవలందించిన జీఎం ఎస్టీపీపీ ఈడీ పీసీ బసివిరెడ్డి పదవీ విరమణ పొదనున్న సందర్భంగా ఆ సంస్థ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ప్లాంట్ ఓపెన్ ఆడిటోరియంలో ఉద్యోగులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం బసివి రెడ్డితో గల అనుబంధాలు, అనుభవాలను గుర్తు చేసుకున్న ఉద్యోగులు సింగరేణికి జీఎం బసివి రెడ్డి ఒక పెద్ద అస్సెట్ అని కీర్తించారు. ఈ సందర్భంగా జీఎం బసివిరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో జీఎంగా పదవీ విరమణ పొందుతున్నందున గౌరవంగా ఉందని, విద్యుత్ ప్లాంట్‌తో తనకున్న అనుబంధాన్ని, తన కాల పరిమితిలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. వివిధ స్థాయిలో తోటి ఉద్యోగుల సహాయ సహకారాలతో పదవీ కాలాన్ని పూర్తి చేసుకోగలిగానని అన్నారు. సహకరించిన వారందరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం స్టోర్స్ ఎలిషా, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జై సింగ్, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం సీసీఎస్ శ్రీనివాసులు, ఏజీఎం ఎఫ్‌జీడీ ఎంఎస్ రమణ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, డీజీఎం ఎస్సార్పీ ఓసీ ఎంవీఎస్‌ఏ చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రీ పాల్గొన్నారు.



పెద్దపల్లి ఎంపీకి ఘన స్వాగతం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పెద్దపెల్లి ఎంపీగా ఇటీవల గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేసి శనివారం మొదటి సారి పట్టణ కేంద్రానికి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద భారీ క్రేన్ సాయంతో గజ మాలతో స్వాగతం పలికి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలబెడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జైపూర్ : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చిన గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి శనివారం హైదరాబాద్ నుంచి ఇందారం మీదుగా మందమర్రికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణను శాలువాలతో సన్మానించడంతో పాటు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి తాజా మాజీ సర్పంచులు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాథోడ్ రమేష్‌ను కోల్పోవడం బాధాకరం

● లైవ్ లంబాడ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ నాయక్



నవతెలంగాణ-నార్నూర్

ఒక మామూలు మనిషిగా పట్టుదలతో ఎలా ముందుకు వెళ్లాలో నిరూపించిన వ్యక్తి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అని అలాంటి ఒక్క పెద్ద దిక్కును కోల్పోయామని లైవ్ లంబాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ సుధాకర్ నాయక్, బంజారా యువ సేన మండల నాయకులు జాదవ్ దత్త అన్నారు. శనివారం ఆయన ఆకస్మిక మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పనులలో తాను నిమగ్నమై ఉన్న సమయంలో ఆయన చలాకి తనం చూసి అప్పటి జిల్లా నాయకుడు వేణుగోపాల చారి నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ గ్రామ నివాసి రాథోడ్ రమేష్‌ను నార్నూర్ జడ్పీటీసీగా అవకాశం కల్పించి రాజకీయ రంగప్రవేశం చేయించారని గుర్తు చేశారు. ఆ తరువాత ఖానాపూర్ నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎంపీగా తనదైన శైలిలో ప్రజల రాజకీయాల్లో రాణించారని గుర్తు చేశారు. జిల్లాలో ఏ పదవి చేపట్టిన ఉట్నూర్ నుండే కార్యక్రమాలు నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయంలో ఉట్నూర్‌కు రాష్ట్రం లోనే ఒక మంచి పేరు తీసుకు వచ్చారన్నారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడిగా పార్టీకి సేవలందించారన్నారు.

జన్నారం : ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ సేవలు చిరస్మరణీయమని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజనా రవీందర్‌రావు వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. అతను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అలాగే మండలంలోని చింతగూడ గ్రామంలోని రాథోడ్ అభిమానులు వివిధ పార్టీల నాయకులు రెండు నిమిషాల మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ జిల్లా నాయకులు సిటిమల భరత్ కుమార్ తాళ్లపల్లి రాజేశ్వర్, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలి

నవతెలంగాణ-కుభీర్

వర్ష కాలం నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనుపను చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయితీ అధికారి గోవర్ధన్‌తో కలిసి జీపీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో పారిశుధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎప్పటికపుడు చెత్త చెదారాన్ని తొలగించాలని అన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వఉండ కుండా చూడలని ఆదేశించారు. మురికి నీళ్ల నిలకడగా ఉంటే అందులో దోమలు, అధికమై ప్రజలకు అనేక రకాల వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. దింతో పాటు ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో చెత్తను ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ అధికారులు గ్రామంలో నర్సరీలో ఉన్న మొక్కలను నటించేలా చూడలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, ఉపాధిహామీ ఏపీఓ హరిలాల్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం



నవతెలంగాణ-దండేపల్లి

నూతనంగా ఎన్నికైన లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ డైరెక్టరర్లు బండ రాకేష్ కనక జంగు గాండ్ల విజయ్ కటుకూరి రాజన్నలను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు లింగంపల్లి, గతంలో ఎన్నడూ లేని విధంగా మండలానికి చెందిన దళితునికి మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం పట్ల వర్షం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీకి ఎన్నికల సందర్భంగా వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ మండల నాయకులు బచ్చల సుభాష్, అంజన్న పాల్గొన్నారు.

గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యాంనాయక్ తండాలో వీధి దీపాలు చేర్పాటు చేయాలని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ పవార్ అర్చన-గోకుల్‌దాస్ ఎంపీడీఓను కోరారు. శనివారం ఎంపీడీఓకు ఆమె వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ స్తంబాలకు ద్వీపాలు అమర్చాలని కోరారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

కబ్జా భూముల్లో కంచె తొలగించిన అధికారులు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్చందలో ముంపునకు గురైన ఎస్సారెస్పీ భూములను కొందరు కబ్జా చేసి సాగు చేసుకుని విక్రయించేందుకు చూస్తున్న భూముల్లో ఏర్పాటు చేసుకున్న కంచెలను శనివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అట్టి భూములను ఎస్ఆర్ఎస్పీ ఏఈ రాజు పరిశీలించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఏఈ రాజు ఆధ్వర్యంలో అధికారులు కంచెలు తొలగించారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష

నవతెలంగాణ-నిర్మల్

వర్షాకాలం సంక్రమించే సీజనల్ వ్యాదుల పట్ల అప్రమంత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డా.ధనరాజు ఫార్మసిస్టులకు, సీనియర్ అసిస్టెంట్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన దష్ట్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది కాబట్టి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. అదేవిధంగా పాము కాటుకు, కుక్క కాటుకు అవసరమైన మందులను అందుబాటులో పెట్టు కోవాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలను భద్రపరిచే కోల్డ్ సైన్ వ్యవస్థను సరైన పద్ధతిలో నిర్వహించాలని అన్నారు. అధిక వర్షాల వల్ల ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉన్న గ్రామాల్లో పంపిణీ చేయడానికి ఎమర్జెన్సీ మెడికల్ కిట్స్‌ను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న మండలం గట్రావుపల్లికి చెందిన ఆర్క జంగుకు సెల్ ఫోన్ అప్పగించినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సెల్ ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి పోయిన మొబైల్‌ను గుర్తించి యాజమానికి అందించినట్లు వివరించారు.

వెడ్మ బొజ్జుకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాల్యాల మనోజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు గతంలో మంత్రి పదవులు చేపట్టిన వారు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించలేకపోయారని పేర్కొన్నారు పేద కుటుంబానికి చెందిన నిజాయితీ నిబద్ధత కలిగిన నాయకుడు బొజ్జుకు అవకాశం కల్పించినట్లయితే పశ్చిమ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వెడ్మ బొజ్జుకు చోటు కల్పించాలని సీఎం కు విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సీడీపీఓ మీద చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-పెంబి

సీడీపీఓ మీద చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీడీపీఓపై ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మాడవి సుంగు పటేల్, అంకుష్ రావ్ పటేల్, మాజీ సర్పంచ్ సూర్యబాను, కుడిమేత మధు, నైతం మారుతీ పటేల్ ఉన్నారు.